కవితా కౌముది

# రెండు చేతులు

అనంత్ మల్లవరపు



**ఒక చేత కత్తి,** ఒక చేత డాలు పట్టి
యుద్ధం చేసినవీ రెండు చేతులు
ఓం శాంతి శాంతి శాంతి అంటూ
తథాగతునిలా తాదాత్మ్యం చెందినవీ రెండు చేతులు

దగుల్బాజీ దద్దమ్మలకు,
స్వార్ధ పూరిత రాజకీయ విషపురుగులకు
జై కొట్టినవీ రెండు చేతులు
జై జవాన్, జై కిసాన్, జైహింద్ అంటూ
దేశభక్తిని చాటినవీ రెండు చేతులు

కర్తవ్య నిర్వహణలో కార్యోన్ముఖుడినై
కాయకష్టం చేసి కడుపు నింపినవీ రెండు చేతులు
మనసిచ్చిన మనిషిని
బాహు బంధంలో బంధించినవీ రెండు చేతులు

దౌర్జన్యాలు దాష్టీకాలు
దుర్మార్గాలు చేసినవీ రెండు చేతులు
బండ రాయిని పిండి కొట్టి
ఉలితో శిలగ మార్చినవీ రెండు చేతులు

అల్లరి చేసే పెంకి పిల్లవాడిని
శిక్షించినవీ రెండు చేతులు

అల్లారు ముద్దు గారాల పట్టికి
గోరు ముద్దలు పెట్టినవీ రెండు చేతులు

పరిచయంలేని వ్యక్తిని
తొలి హస్తబంధనంతో
పాతమిత్రుని చేసినవీ రెండు చేతులు
నా దేశ సంస్కృతిని ' నమస్తే 'గా
నలుదిశలా చాటి చెప్పినవీ రెండు చేతులు

ముకుళిత హస్తాలతో
జోడించి నమస్కరించి ప్రార్థిస్తున్నా!
నాలోకి నేను జారి పోతున్నా!
ప్రపంచ శాంతిని జారవిడవ కన్నా!



***

## ఆవేశాలు - అనుభూతులు రాళ్ళపల్లి రామసుబ్బారావు

**జనజీవన స్రవంతిలో సంగీతం**
పాటగ మారే మాటల బాటన సాహిత్యం
విడిపోని విడదీయలేని జంట
అనుభవాల అనుభూతుల పసిడి పంట

మాటలు పాటలుగ మారిన గీతాలు
స్వరాలు లయలుగ కూడిన హొయలు
శృంగార స్వరార్చనతో తరించిన క్షేత్రయ
పాటల ఆలంబన పరవశించిన త్యాగయ

మాటలకు లొంగని అనుభవాలు ఆవేశాలు
అందుకొని అందించే సంగీత సౌరభాలు
సంగీతం పొందికైన మాటల తోరణం
పాటల రెక్కల హాయిగ విహరించే విహంగం

సంగీత సాధన సప్తస్వరార్చన
భక్తి భావము ముక్తికి సోపానము
అమరిన మాటల అందం సంగీతం
సారస్వత రస సిద్ధిని అందించే సాహిత్యం ***

## తొలిపదం సి.హెచ్.నాగభూషణరావు

**తొలి చినుకు**
పుడమి తల్లిని పులకింపజేస్తుంది
పచ్చదనాన్ని అందిస్తుంది

తొలి అడుగు
సుదీర్ఘ ప్రయాణానికి నాంది అవుతుంది
గమ్యానికి దగ్గర చేస్తుంది

తొలిమాట
అమ్మ పిలుపుతో మొదలౌతుంది
అభిమానానికి మూలమౌతుంది

తొలిపైసా
సంపాదనకు పునాది వేస్తుంది
అష్ట ఐశ్వర్యాలకు మొదటి మెట్టు ఔతుంది

తొలిప్రేమ
మనసులని కలుపుతుంది
మమతలను పంచుతుంది

అందుకే.. తొలిపదం ప్రతి అక్షరం.. సువర్ణాక్షరం..!! ***

## నీ నవ్వు కోసం సుజ్జి

ఒక తీరికైన సాయంత్రం నీతో కలిసి
మంచు వర్షాన్ని సంబరంతో చూసిన జ్ఞాపకం మనసులో మెదిలింది.
నువ్వూ - నేనూ, మన మధ్య పెరిగిన దూరం,
మిగిలిన అగాధం లాంటి మౌనం..
అన్నీ తలపుకి వచ్చి అయోమయంలో ఉన్న సమయాన..
నా అరచేతిలో నీ స్పర్శ జాడ వెతుక్కుంటున్నా!
నువ్వు నన్ను వదిలి వెళ్ళావని నీమీద కోపమెంత పెంచుకున్నానో గానీ..
నీ నవ్వు మొహమైనా గురుతు లేదిప్పుడు!
ఒక్కసారి నీ చిరునవ్వు నిండిన మోము కలగందామనుకుంటే..
ఎన్నెన్ని రాత్రులు నీ కలవరింతలో గడపాలో మరి! ***

## 50 వ మైలురాయి వెంకట శాస్త్రి

ఐదు దశాబ్దాలు నిండిన తరుణం
అర్ధ శతాబ్దపు శరవేగం
ఎందరో మహానుభావులు, అందరికి వందనాలు.
తనువు నిచ్చిన తల్లి, తన పేరు నిచ్చిన తాతగారు,
నీతి నేర్పిన నాన్న గారు, తోడుగా పెరిగిన తమ్ముళ్ళు,
తోడూ నీడగా ఉంటానంటూ వెంట వచ్చిన భార్య,
చదువు నేర్పిన గురువులు, సేద తీర్చిన తరువులు,
మిన్ను విరిగి మీద పడ్డప్పుడు వెన్ను తట్టి నిలబెట్టిన మిత్రులు.
పుట్టుకొచ్చిన పిల్లలు, నెట్టు కొచ్చిన ఏళ్ళు.
ఏబది ఏళ్ళ ఏకరువు, ఎన్నో అనుభవాల బరువు,
మరెన్నో అనుభూతుల నెలవు.
కాశీ మజిలీ కధల్లాంటి మజిలీలు,
తప్పొప్పుకుంటూ తీసిన గుంజీలు.
పబ్లిక్‌గా చేసిన పకపకలు, ప్రైవేటుగా తడిపిన దిళ్ళు.

అనుకోకుండా అందివచ్చిన సువర్ణావకాశాలు కొన్ని,
అందని ద్రాక్షపళ్ళు ఎన్నో.
సునాయాసంగా సాధించిన విజయాలు కొన్ని,
కేవలం ఆయాసాన్ని మిగిల్చిన్న ప్రయాసలు మరికొన్ని.
తీరాలు దాటి వచ్చేసినా మారని తీరులు,
దూరాలు పెరిగినా మాయని మమతలు.
నడచి వచ్చేసిన దారి కనిపిస్తుంటే బహు నాజూకుగా,
చేరాల్సిన గమ్యం అనిపిస్తుంటే బహు దూరం,
నే నిలబడి ఉన్నా 50 వ మైలు రాయి దగ్గర,
జ్ఞాపకాలు నెమరేస్తూ, వాస్తవాలు గుర్తిస్తూ. ***

## తను — తమస్విని

**నా బాధలకి** తను ఓదార్పవుతుంది
నా సంతోషంలో తను చిరునవ్వు!
నా ఆకలికి తను వంటిల్లవుతుంది
నా ఆలోచనలకి తను శ్రోత!
నా అనారోగ్యానికి తను ఔషధమౌతుంది
నా సమస్యలకి తను పరిష్కారం!
నా ఆవేదనకి తను కన్నీరవుతుంది
నా ఆందోళనకి తను ఉపశమనం!
నా మలి సంధ్యలో తను చేతి కర్రవుతుంది
కొడిగట్టిన జీవితానికి చిరుదివ్వె!
నేను మృత్యువు ఒడిలోకి జారినప్పుడు
తను నిలువెత్తు దుఃఖమౌతుంది
నా మరణానంతరం తనలో నేను!
నా భౌతిక రూపానికి తను రెప్లికా
నా భావాలకి తను స్పందన!
నా గుప్పెడు గుండెకి తను భగవంతుడిచ్చిన కొండంత అండ
అవును తను నా కూతురు!! ***

## మృత్యుంజయుడు — వసుంధర



ఎండ మండిపోతున్నది
కుళాయ్‌కింద కాళ్లు పెట్టి టాపు తిప్పితే– ఉడుకు నీళ్లకి చుర్రుమంది
గీజర్ ఆన్ చేసాననుకుని కరెంటు మీటరు తిరిగింది
గడియారం ఆగినది
గమనించక గంటెక్కువ పనిచేసి– ఓవర్ టైమడిగాను
కాలమాగిపోయిందని ఆఫీసరు ఇంక్రిమెంటు ఆపేసాడు
ధరలు మింటికెగసినవి
సామూహిక ఆందోళన ఫలితంగా– నా జీతం పెరిగింది
ఆదాయం పెరిగిందని ఆ పన్నులు ఈ పన్నులు ధరలేనయమనిపించాయి
గొంతుకెండిపోతున్నది
బావుల్లో పంపుల్లో చెరువుల్లో నదుల్లో– చుక్క కూడ నీరు లేదు
దయాగుణం చూపాలని నాయకుడు ప్రొహిబిషన్ ఎత్తేసాడు
ఎన్నికలైపోయినవి
ఓటువేసి గెలిపించిన ప్రతిఫలాపేక్షతో– నేతను అభినందించాను
ఏ నేతకు అనుకరణో కృతజ్ఞుణ్ణి అనడానికి కృతఘ్నుణ్ణి అన్నాడు
బ్రతుకు భారమయ్యింది
చావాలని కొండ ఎక్కి దూకబోతే– ఎవడో రక్షించాడు
యమదూతని తానేనని నేనున్నదె నరకమని
చావు నాకు రాబోదని నిజం తెలిపి వెళ్లాడు***

## రసరేఖలు — బచ్చోటి శ్రీధర్



**ఒకపరి గగనకుసుమమై** యొప్పినావు
ఒకపరి గరికవై తల యూచినావు
దూర తారవై యొకసారి తోచినావు
చినుకువై యొకపరి నన్ను చేరినావు

వెలుగు బాటలో నను నడిపించినావు
ఇరుల మధ్య వెన్నెలలు కాయించినావు
ఇసుకదారుల పూలు పూయించినావు
వరసుమమ్ములకమృతమ్ము పంచినావు

ఇది యనిర్వచనీయమౌ మృదుల గీతి
కా రసోద్యాన మధుర విహారమేమొ
ఇది ప్రణయ రాజ్య శుద్ధాంత సదనమందు
అడుగు వేసెడు నాట్యవిన్యాసమేమొ

ప్రేమ నాకొరకెలుగెత్తి పిలుచుచుండె
ప్రేమ నాల్గు దిక్కులను వ్యాపించుచుండె
ప్రేమ విద్యుల్లతగ తేజరిల్లుచుండె
ప్రేమ నిత్యాగ్నిహోత్రమై వెలుగుచుండె

ఏమి యైనదో యెరుగ నా హృదయమునకు
అణువణువులోన నీవె యున్నట్లు తోచు
తెలివి కోల్పోయి యెదదారి తిరుగుచుందు
వెర్రితనమో కవిత్వమో ప్రేమ యేమొ

*****